భారత వ్యవసాయ విధానం... సమీక్ష

దేశంలో వ్యవసాయ విధానాన్ని పరిశీలిస్తే.. రైతులకు సంబంధించిన పెట్టుబడి, ఉత్పత్తి నిర్ణయాల్లో ప్రభుత్వ ప్రత్యక్ష జోక్యం తక్కువగానే ఉంటుంది. కానీ వ్యవసాయదారుల కార్యకలాపాలైన భౌతిక ఉత్పత్తి, ఆర్థిక అంశాలను ప్రభుత్వం ప్రభావితం చేస్తోంది. దేశంలో సాగు నీటి డిమాండ్ రోజు రోజుకు పెరుగుతోంది. 'ఇంటిగ్రేటెడ్ వాటర్ రిసోర్స్ డవలప్‌మెంట్ ప్లాన్'పై ఏర్పాటు చేసిన జాతీయ కమిషన్ అభిప్రాయంలో.. 2050 నాటికి దేశంలో సాగునీటి డిమాండ్ 50 శాతం పెరగనుంది. అయితే వ్యవసాయ విధానంలో ఈ డిమాండ్‌కు అంత ప్రాధాన్యం ఇవ్వలేదు. ధరల్లో నెలకొని ఉండే ఒడిదుడుకులు, ప్రకృతి వైపరీత్యాలు రైతులను అనిశ్చితిలోకి నెట్టివేస్తున్నాయి. మనం అనుసరిస్తున్న వ్యవసాయ విధానాల్లో సంస్థాపరమైన సంస్కరణలకు ప్రాధాన్యమిచ్చినపుడే వ్యవసాయ రంగంలో సుస్థిర వృద్ధితోపాటు పేదరిక నిర్మూలన సాధ్యమవుతుంది. ప్రాంతాల వారీగా ప్రత్యేక వ్యూహాలను అమలు చేయాలి. అప్పుడే వ్యవసాయరంగంలో వనరుల సమర్థ వినియోగం జరుగుతుంది. తద్వారా లక్షిత వృద్ధి 4 శాతం చేకూరుతుంది.

దేశ సాంఘిక-ఆర్థికాభివృద్ధిలో వ్యవసాయ రంగం ప్రధానపాత్ర పోషిస్తోంది. మొత్తం శ్రామికశక్తిలో సగం మందికి పైగా ఉపాధి అవకాశాలను కల్పిస్తూ ఇతర రంగాల అభివృద్ధిని ప్రభావితం చేస్తోంది. అంతేకాకుండా దేశ జనాభాకు ఆహార భద్రత కల్పిస్తోంది. స్వాతంత్ర్యానంతరం దేశంలో వ్యవసాయ రంగం సగటు వృద్ధి రేటు 3 శాతం కంటే తక్కువగానే నమోదైంది. ఈ వృద్ధి కొన్ని ప్రాంతాల్లో ఎక్కువగా ఉండడం మరికొన్ని ప్రాంతాల్లో ఆశించినంతగా నమోదుకాకపోడం వల్ల కూడా ప్రాంతీయ అసమానతలు పెరిగాయి.

వ్యవసాయ విధానం– వివిధ దశలు: మొదటి దశ

దేశంలో ఇప్పటి వరకు అవలంబించిన వ్యవసాయ విధానానికి, ఉత్పత్తి వృద్ధికి మధ్య సహసంబంధం కనిపిస్తోంది. గత ఆరు దశాబ్దాలుగా అవలంబించిన వ్యవసాయ విధానాలను స్థూలంగా మూడు దశలుగా విభజించవచ్చు. 1950-51 నుంచి 1960వ దశకం మధ్య వరకు అనేక వ్యవసాయ సంస్కరణలు, సంస్థాగతమైన మార్పులు చోటుచేసుకున్నాయి. అనేక నీటిపారుదల ప్రాజెక్టుల అభివృద్ధి జరిగింది. మధ్యవర్తిత్వ భూస్వామ్య వ్యవస్థ రద్దు చేస్తూ, కౌలుదార్ల భద్రత, యాజమాన్య హక్కులు కల్పించారు. అన్ని రాష్ట్రాలు భూపరిమితి చట్టాలను రూపొందించాయి. వ్యవసాయదార్లు పరపతి కోసం వడ్డీ వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లపై ఆధారపడకుండా ఉండడం కోసం సహకార పరపతి సంస్థలను మరింత పటిష్టం చేశారు. చిన్న



కమతాల సమస్యను నివారించడానికి.. కమతాల సమీకరణ ప్రక్రియను ప్రవేశపెట్టారు. హరిత విప్లవానికి ముందు సాగు విస్తీర్ణం వృద్ధి ఎక్కువ. హరితవిప్లవ కాలంలో పంటల ఉత్పత్తిలో వృద్ధి నమోదు కావడానికి ఉత్పాదకతలో వచ్చిన పెరుగుదల కారణమయ్యింది. వరి, గోధుమ పంటల్లో ప్రవేశపెట్టిన నూతన వంగడాల వల్ల ఉత్పాదకత పెరుగుదల సాధ్యమయ్యింది. 1960వ దశకం ముందు దేశంలో ఏర్పడిన ఆహార కొరతను నివారించడానికి విధాన నిర్ణేతలు ఆహార దిగుమతులపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించారు. నూతన వ్యవసాయ విధానం కారణంగా ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధ్యమయ్యింది. సంప్రదాయ పనిముట్ల స్థానంలో నూతన సాంకేతిక పరిజ్ఞాన వినియోగం పెరిగింది. తద్వారా ఏర్పడిన డిమాండ్ కారణంగా ఆగ్రో పరిశ్రమ మెరుగైన వృద్ధిని సాధించింది. స్థూలంగా పరిశీలిస్తే.. వ్యవసాయ విధానం మొదటి దశలో వ్యవసాయ విస్తరణ, పరిశోధన, ఉత్పాదితాల సరఫరా, పరపతి, మార్కెటింగ్, మద్దతు ధరలు, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలకు విధాన నిర్ణేతలు ప్రాధాన్యమిచ్చారు. హరిత విప్లవానికి ముందు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ), వ్యవసాయ ధరల కమిషన్ ఏర్పాటయ్యాయి.

రెండో దశ:

వ్యవసాయ రంగంలో రెండో దశ 1980 ముందు ప్రారంభమయ్యింది. పారిశ్రామిక రంగంలో నియంత్రణల తొలగింపు, లైసెన్సింగ్ విధానాన్ని సరళతరం చేయడం వంటి కీలక ఆర్థిక విధానాలు ఈ దశలో చోటుచేసుకున్నాయి. ఈ విధానాల నేపథ్యంలో వ్యవసాయ రంగంలో ఎటువంటి వ్యూహాలు అమలు కాలేదు. రెండో దశలో చోటుచేసుకున్న వ్యవసాయ వృద్ధి వల్ల రైతుల వాస్తవిక ఆదాయాలు పెరిగాయి. దాంతో వ్యవసాయ రంగంపై ఆధారపడిన కొన్ని వర్గాల చేతిలో ఆర్థిక స్థోమత పెరిగింది. ఫలితంగా దేశంలో వ్యవసాయ విధానాలను ప్రభావితం చేసే స్థాయికి వారి పలుకుబడి పెరిగింది. ఈ దశలో వ్యవసాయ రంగంలో సబ్సిడీలు, ఈ రంగానికి ప్రభుత్వం ఇచ్చే మద్దతు

పెరిగింది. అంతేకాకుండా ఈ దశలో వ్యవసాయ రంగంలో అవస్థాపన సౌకర్యాలపై ప్రభుత్వ రంగ పెట్టుబడులు తగ్గి వ్యవసాయదారుల పెట్టుబడులు పెరిగాయి. దేశంలోని కొన్ని ప్రాంతాల్లోనే ఉత్పత్తి వృద్ధి కేంద్రీకృతమయ్యింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ఆహార ధాన్యేతర ఉత్పత్తుల్లో (నాన్ ఫుడ్ గ్రెయిన్ అవుట్‌పుట్) అధిక వృద్ధి చోటు చేసుకుంది. పాల ఉత్పత్తి, ఫిషరీస్, పౌల్ట్రీ, కూరగాయలు, పండ్ల ఉత్పత్తిలో నమోదైన పెరుగుదల కారణంగా ఈ దశకంలో వ్యవసాయ స్థూల దేశీయోత్పత్తిలో అధికవృద్ధి సాధ్యమయ్యింది.

మూడో దశ:

దేశవ్యాప్తంగా నీటి పారుదల సౌకర్యాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనే హరిత విప్లవం సాధ్యమయ్యింది. వ్యవ సాయ రంగంలో ప్రవేశపెట్టిన నూతన సాంకేతిక పరిజ్ఞానంతో డ్రైల్యాండ్ ప్రాంతాలు ఆశించినంతంగా లబ్ధి పొందలేదు. కానీ తర్వాత కాలంలో నూనె గింజలు, ముతక ధాన్యాల(కొయర్స్ సిరియల్స్)లో వచ్చిన మేలు రకమైన విత్తనాలు డ్రైల్యాండ్ ప్రాంతాల్లో ఉత్పాదకత వృద్ధి పెరుగుదలకు దోహదం చేశాయి. దేశంలో 1991లో ప్రవేశపెట్టిన సరళీకృత ఆర్థిక సంస్కరణల కారణంగా ఆర్థిక సంబంధిత కార్యకలాపాల్లో ప్రభుత్వ పాత్ర కొంత మేర తగ్గింది. సంస్కరణల ఫలితంగా వ్యవసాయ రంగం ప్రత్యక్షంగా ఎటువంటి దుష్పలితాలు ఎదుర్కోలేదు. అయినా పరోక్షంగా చోటు చేసుకున్న కొన్ని పరిణామాలు.. వినిమయరేటులో తగ్గుదల, అంతర్జాతీయ వాణిజ్యంలో సరళీకరణ, పరిశ్రమలకు రక్షణ విధానం ఉపసంహరించుకోవడం లాంటి చర్యలు వ్యవసాయ రంగంలో సంక్షో భానికి దారితీశాయి. ఈ విధమైన మార్పుల కారణంగా వ్యవసాయరంగం అనేక సవాళ్లను ఎదుర్కొంది.

ఈ నేపథ్యంలో వ్యవసాయరంగానికి చేయూతనివ్వడానికి ఒక అభిలషణీయ విధానం అవసరమని ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలో జులై 2000లో ప్రభుత్వం 'నూతన వ్యవసాయ విధానం' ప్రకటించింది. ఈ విధానం ద్వారా వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న సవాళ్లను నాలుగు కేటగిరీలుగా విభజించారు. అవి 1. వృద్ధి 2. సుస్థిరత 3. సమర్థత 4. సమానత్వం. ఆహార భద్రత, ఉపాధి, వ్యవసాయ రంగంపై ఆధారపడిన ప్రజల జీవనం ప్రమాణం పెంపుదల వంటి అంశాలు కూడా ఈ రంగానికి సంబంధించిన ముఖ్యాంశాలు.

నూతన వ్యవసాయ విధానం: జులై 28, 2000

గ్రామీణ ప్రాంతాల్లో అవస్థాపనా సౌకర్యాలను మెరుగుపర చడం ద్వారా వ్యవసాయరంగంలో అధికవృద్ధి సాధించడం, ఆగ్రో బిజినెస్ వృద్ధిని వేగవంతం చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచడం, వ్యవసాయ కార్మికులు, రైతులు వారి కుటుంబాల జీవన ప్రమాణ స్థాయిని పెంచడం, గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలసలను అరికట్టడం, సరళీకరణ, ప్రపంచీకరణ నేపథ్యంలో ఎదురయ్యే సవాళ్లకు దీటుగా వ్యవసాయ రంగాన్ని తీర్చిదిద్దడం లక్ష్యంగా నూతన వ్యవసాయ విధానాన్ని ప్రకటించారు. వచ్చే రెండు దశాబ్దాలలో వ్యవసాయ విధానం కింది లక్ష్యాలను సాధించాలని నిర్దేశించుకున్నారు.

1. వ్యవసాయరంగ సగటు వార్షిక వృద్ధిని 4 శాతానికి పైగా సాధించడం.
2. వనరుల అభిలషణీయ వినియోగం ద్వారా అధిక వృద్ధి.
3. సమానత్వంతో కూడిన వృద్ధి, అంటే ఈ రంగంలో జరిగే వృద్ధిని అన్ని ప్రాంతాలు, రైతుల మధ్య సమానంగా పంపిణి చేయడం.
4. సాంకేతికంగా, పర్యావరణ పరంగా, ఆర్థికంగా సుస్థిర వృద్ధి సాధించడం.
5. డిమాండ్ ప్రేరిత వృద్ధి ద్వారా స్వదేశీ మార్కెట్ అవసరాలు తీర్చడం.
6. సరళీకరణ, ప్రపంచీకరణ నేపథ్యంలో ఎదురయ్యే సవాళ్లకు దీటుగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల వృద్ధి ద్వారా ప్రయోజనం పొందడం.

ఈ లక్ష్య సాధనకు ఉద్యానవన ఉత్పత్తులు, ఫ్లోరికల్చర్, తోటల ఉత్పత్తులు, అరోమేటిక్ అండ్ మెడిసినల్ ప్లాంట్స్, ఎగుమతుల వృద్ధి, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి వృద్ధికి ఈ విధానం ప్రాధాన్యమిస్తుంది. పౌల్ట్రీ, డైరీయింగ్, ఆక్వాకల్చర్, యానిమల్ హస్బెండ్రీ అభివృద్ధికి ఎక్కువ అవకాశం కల్పిస్తుంది. వ్యవసాయదారుల పెట్టుబడులు పెంచడానికి, తయారీ రంగంతో పోల్చినపుడు వ్యవసాయ ఉత్పత్తుల వర్తక నిబంధనలను మెరుగుపరచడం ద్వారా స్వదేశీ, విదేశీ మార్కెట్‌లో సంస్కరణలకు అనువైన వాతావరణాన్ని ఈ విధానం కల్పిస్తుంది. వ్యవసాయరంగంలో అనేక దశల్లో సంస్థాగతమైన సంస్కరణల సక్రమ అమలు ద్వారా ఉత్పత్తి, ఉత్పాదకత పెరుగుదలకు ఈ విధానం ప్రాధాన్యమిస్తుంది. సకాలంలో సరిపడ విత్తనాలు, ఎరువులు, మొక్క రక్షణ కోసం రసాయనాలు, బయో పెస్టిసైడ్స్, వ్యవసాయ పనిముట్లు, పరపతి అందించడం ద్వారా నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని వ్యవసాయ విధానం భావిస్తోంది.

నీటి వనరులు:

వ్యవసాయ, పారిశ్రామిక, కుటుంబ అవసరాలకు నీటి వినియోగం పెరగడంతో నీటి వనరుల లభ్యతలో కొరత ఏర్పడింది. ప్రపంచ నీటి వనరులలో 4 శాతం వాటా మాత్రమే కలిగి ఉన్న భారత్ ప్రపంచ జనాభాలో మాత్రం 16 శాతం వాటా కలిగి ఉంది. అధిక జనాభా వృద్ధి, పట్టణీకరణ, ప్రజల జీవన ప్రమాణం పెరుగుదల కారణంగా నీటి వనరులపై క్రమంగా ఒత్తిడి పెరుగుతోంది. 2020 నాటికి సాగునీటి డిమాండ్ 30 శాతం పెరిగే అవకాశం ఉన్నందున.. ఆహార ఉత్పత్తుల స్వయం సమృద్ధి సాధన దిశలో భూగర్భ జలాలు ప్రధాన పాత్ర వహించగలవని వ్యవసాయ శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

వ్యవసాయ రంగంలో 4 శాతం వృద్ధి సాధనకు 'ప్రాంతాల వారీ ప్రత్యేక వ్యూహాలు' అవసరం. ఈ వ్యూహరచనలో భాగంగా ఆయా

ప్రాంతాల్లోని భూగర్భ జలాల స్థితి, భూసార స్థితి (సాయిల్ హెల్త్) గురించి సమాచారం అవసరం. మెరుగైన సాగునీటి సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడం ద్వారా నీటి వినియోగ సమర్థత పెంచాలి. ఆర్గానిక్ ఫార్మింగ్‌కు సంబంధించిన అంశాన్ని నూతన వ్యవసాయ విధానంలో చర్చించలేదు. సహజ వనరుల యాజమాన్యం, ఉత్పత్తి, మార్కెటింగ్ కార్యకలాపాలలో ప్రజా భాగస్వామ్యాన్ని పెంచడానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా నూతన వ్యవసాయ విధాన లక్ష్యాలను అధిగమించవచ్చు.